క్లుప్తంగా...

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ స్టడీ సర్కిల్ మొదటి ఎంట్రెన్స్ టెస్ట్ ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు కోసం రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి జి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఈ నెల 21న ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

వికలాంగులకు అండగా ఉంటాం



సాక్షి, మేడ్చల్ జిల్లా: వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వికలాంగుల హక్కుల చట్టంపై జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ వికలాంగుల పట్ల వివక్షత చూపకుండా ప్రవర్తించాలని అధికారులకు సూచించారు. వికలాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అక్కేశ్వరావు మాట్లాడుతూ వికలాంగుల చట్టం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. సబ్సిడీ రుణాలు, నిరుద్యోగ వికలాంగులకు ఉచిత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంగారాం, నాగభూషణం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



యూజీడీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ

శామీర్‌పేట్: సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి మైసమ్మ గూడ 6వ వార్డులో రూ.10 లక్షల నిధులతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు పెంటయ్యముదిరాజ్, కమిషనర్ రాములు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ దుర్గప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

20 వరకు ఆక్యుప్రెషర్ శిబిరం

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లో ఆక్యుప్రెషర్ చికిత్సా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. పలు రకాల నొప్పులు, వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. టౌన్‌షిప్ హెల్త్ సెంటర్ వద్ద ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు శిబిరం పనిచేస్తుందన్నారు.

బీసీ పొలిటికల్ ఫ్రంట్ సభ్యత్వ నమోదు



ఘట్‌కేసర్: పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాచారి ఆధ్వర్యంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ సభ్యత్వ నమోదును గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 55 శాతం రాజ్యాధికారం సాధించడానికి సభ్యత్వ నమోదును చేపట్టామన్నారు. సామాజిక న్యాయం సాధించడానికి బీసీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్, శైలేశ్, సందీప్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

మేడిపల్లి: పీర్జాదిగూడ వివేకానందనగర్‌కు చెందిన పేద వైద్య విద్యార్థి గుమ్మడి విశాల్‌కు పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి గురువారం రూ.లక్ష ఆర్థిక సహాయం చేశారు. పీర్జాదిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుమ్మడి వెంకటయ్య కుమారుడు విశాల్ జోకా కోల్‌కత్తాలోని ఈఎస్‌ఐ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసిస్తున్నాడు. నిరుపేద కావడంతో కళాశాల ఫీజులు, ఇతర ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వైద్య విద్య పూర్తయ్యే వరకు అండగా ఉంటామని అన్నారు. కార్పొరేటర్ మద్ది యుగంధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు మాదుగుల చంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చెరుకు పెంటయ్యగౌడ్ రఘువర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

వచ్చేది వానాకాలం.. జాగ్రత్తలు అవసరం..

- నేటి నుంచి పురపాలికల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్
- రానున్న వర్షాకాలం దృష్ట్యా 27వ తేదీ వరకు అవగాహన
- మార్గదర్శకాల జారీతో శివారు పట్టణాల్లో ప్రణాళిక



సాక్షి, మేడ్చల్ జిల్లా: రుతు పవనాల రాక నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్ని పురపాలికల్లో ఈ నెల 19 నుంచి 27 వరకు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మున్సిపల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ పురపాలక సంఘాలకు మార్గదర్శకాలు జారీ చేశారు. నగర శివారు పురపాలక సంఘాల్లోని అన్ని ఇళ్ల నుంచి చెత్తను సేకరించి.. తడి, పొడిగా వేరు చేయాల్సి ఉంటుంది. తడిచెత్తను కంపోస్టు కేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. వాణిజ్య నిర్మాణాలు, రోడ్ల వెంట ఉండే వ్యర్థాలను పూర్తిగా ఎత్తివేయాలని, ముళ్ల పొదలనూ తొలగించాలని పురపాలక సంఘాలకు జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన కట్టడాలను కూల్చేయాలని, ఇప్పటి వరకు నోటీసులివ్వని నిర్మాణాలపై నివాసయోగ్యం కాదంటూ రాయించాలని పేర్కొంది. మాంసం దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంతోపాటు తరచూ దోమల నివారణ మందును పిచికారీ చేయాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, పురపాలక సంఘాల మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, కార్పొరేటర్లు/కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అలాగే.. పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా కలెక్టర్ రోజువారీ నివేదికలను పంపాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది.

స్పెషల్ డ్రైవ్ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట్, పోచారం, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, ఘట్‌కేసర్, కొంపల్లి, దుండిగల్ పురపాలక సంఘాల్లో 1,472 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. పట్టణాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి సంవత్సరం వానాకాలం ముందు చేపడుతున్నట్లుగానే.. ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని నిర్ణయించారు. పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత తాగునీటి ట్యాంకులు, మినీట్యాంకులు శుభ్రం చేయడం, లీకేజీలను అరికట్టాల్సి ఉంటుంది. రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. రోడ్లపై గుంతలను పూడ్చివేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ సంస్థల్లో శుభ్రత పనులతోపాటు పురపాలక సంఘాల్లో మిగిలిపోయిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంటుంది.

కబడ్డీ విజేతగా చౌదరిగూడ జట్టు

ఘట్‌కేసర్: ఏదులాబాద్ క్రీడా ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో కబడ్డీలో చౌదరిగూడ జట్టు మొదటి స్థానం, కొర్రెముల్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణారెడ్డి, జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్‌కుమార్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, అనిత, యాదవలక్ష్మీ, లక్ష్మీ, మల్లేశ్‌ముదిరాజ్, విజయ్, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, శ్రీను, యుగేందర్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 5వ డివిజన్ విఠల్‌రావునగర్‌కు చెందిన మాధవరావుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.27,500 చెక్కును గురువారం మంత్రి మల్లారెడ్డి, కార్పొరేటర్ ఏకే.మురుగేష్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లిలో పర్యటించిన డీఎల్‌పీఓ స్మిత



కీసర: శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం యాద్గార్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న పనులను డీఎల్‌పీఓ స్మిత పరిశీలించారు. గ్రామంలోని వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనులను, హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ, డంపింగ్‌యార్డు, గ్రేవ్‌యార్డు వద్ద పారిశుద్ధ్య పనులు, అదేవిధంగా నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేపట్టారు. దీంతో గోధుమకుంట, కరీంగూడ గ్రామాల్లో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను ఆయా గ్రామాల సర్పంచులు మహేందర్‌రెడ్డి, కొకుట్ల గోపాల్‌రెడ్డి పరిశీలించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్



మచ్చబొల్లారంలో ముగిసిన జోడో యాత్రలో పాల్గొన్న నందికంటి శ్రీధర్

అల్వాల్: హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కొద్ది రోజులుగా మచ్చబొల్లారం డివిజన్‌లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర గురువారం ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలన్నారు. ప్రతి దళితుడికి దళిత బంధు అందేవిధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కేవలం ఓట్ల వరకే పరిమితం అయ్యాయన్నారు. మాయమాటలు చెబితే నమ్మే కాలం పోయిందన్నారు. ప్రజల పన్నులతో అందిస్తున్న సంక్షేమ పథకాలకు సైతం లంచాలు ఇవ్వాల్సి వస్తోందన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని కాలనీల్లో సమస్యలే అధికంగా ఉన్నాయన్నారు. కమిషన్లు, కలెక్షన్ల కోసమే అభివృద్ధి జపం చేస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల తొత్తులుగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్, దోని, రమేష్, నిమ్మ అశోక్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, సీఎల్ యాదగిరి, అప్సర్, పవన్, సంజీవ్‌కుమార్, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వీనస్‌మేరి, సాయి, పాండు, విజయలక్ష్మీ, నిర్మల, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను అందజేస్తూ..

ఘట్‌కేసర్: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మిక సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రవిచంద్ర అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూన్ 6, 7వ తేదీల్లో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ సిబ్బందికి మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, స్వామి, హరినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజా సమస్యలపై గురువారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ సామల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రధాన రహదారి ప్యాచ్‌వర్క్ కోసం తీర్మానం చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వార్డు ఆఫీసర్లు సకాలంలో విధులకు హాజరు కావడం లేదని, వారిని వేరే సెక్షన్లకు మార్చాలని కోరారు. పారిశుద్ధ్య విషయంలో పనితీరు బాగున్నా, కొన్ని కాలనీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్ కంపెనీలు, కుటీర పరిశ్రమలు జనావాసాలకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని వాటిపై చర్యలు ఆదేశించారు. అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.వాణిరెడ్డి, మేనేజర్ మంజులత, కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, రాసాల వెంకటేశ్‌యాదవ్ డీఈఈ శారద, శ్రీలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



నాచారంలో ప్రజాదీక్షలో రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం నాచారం డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడల మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రజాదీక్ష, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాగిడి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. నాచారం విలేజ్ వార్డు కార్యాలయం, పునర్‌నిర్మాణంలో జాప్యం, అంగన్‌వాడీ స్కూల్, శ్మాశనవాటిక, పటేల్‌కుంట చెరువు సుందరీకరణ, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భద్రయ్య, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కృష్ణారెడ్డి, సంజయ్ జైన్, ఆశ్రూ, హెచ్‌ఆర్ మోహన్, శ్రీనివాస్, గ్యార కిరణ్, టోనీ ఫ్రాన్సిస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బోడుప్పల్: ద్వారకానగర్‌లో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి గురువారం పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలో విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో ఎయిర్‌టెక్ మెషిన్‌తో డ్రైనేజీని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త చెదారాన్ని రోడ్లపై, డ్రైనేజీల్లో వేయకుండా స్వచ్ఛ ఆటో కార్మికులకు అందించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరం నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మోదుగు శేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా శివారు గ్రామాల అభివృద్ధి

- టీఎస్–బీపాస్‌తో భవన నిర్మాణాలకు అనుమతులు
- ఉన్నచోటు నుంచే అనుమతికి దరఖాస్తు చేసుకోవచ్చు
- ఇళ్ల అనుమతుల్లో మధ్యవర్తి జోక్యం ఉండదు
- సమావేశంలో మంత్రి చామకూర మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్–బీపాస్‌తో ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభతరంగా ఉన్న చోట నుంచే ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ అనుమతులను పొందవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో టీఎస్–బీపాస్‌పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పట్టణాలకు దీటుగా నగర శివారు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. గతంలో గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే.. మండల కేంద్రాలకు వచ్చి సంబంధిత ఇంజనీర్లతో ప్లాన్ తీసుకొని, వాటిని గ్రామపంచాయతీలో నమోదు చేసుకొనేందుకు చాలా సమయం పట్టేదని మంత్రి పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను తీర్చడానికి పంచాయతీల్లో కూడా టీఎస్–బీపాస్ ప్రవేశ పెట్టిందన్నారు. భవన నిర్మాణాల అనుమతులను ఇక మీదట మధ్యవర్తి జోక్యం లేకుండా ఇంటి యజమాని నేరుగా పొందవచ్చని, ఇది మంచి పరిణామమని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. మేడ్చల్ జిల్లాలో గ్రామాలు పట్టణాలతో సమానంగా అభివృద్ధిలో పోటీ పడుతున్నాయన్నారు. 60 గజాల నుంచి 120 గజాల స్థలాల్లో ఇళ్లు కట్టుకొనే వారికి ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు మంజూరు చేస్తుందని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో త్వరలో 3 వేల మంది నిరుపేదలకు గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ – బీపాస్‌తో గ్రామాల్లో ఆదాయం పెరుగుతోందన్నారు. గ్రామాల్లో సర్పంచులు, సెక్రటరీలు సంబంధిత అధికారుల సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రెండో విడత దళితబంధు పథకం కింద మేడ్చల్ నియోజకవర్గంలో త్వరలో 1,100 మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం, జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి, డీపీఎల్‌ఓ స్మిత, ఎంపీఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలపై అవగాహన కల్పించాలి



సమీక్షలో చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ, కమిషనర్ రాములు

శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్‌ఆర్‌ఆర్(రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్) కేంద్రాల ఏర్పాటు కోసం అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమీక్షలో కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి వచ్చేనెల 5 వరకు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలు ఉంటాయని, వాటి బాధ్యత వార్డు ఆఫీసర్లు ఆర్‌పీలదేనని సూచించారు. ప్రజల ఇళ్లలో ఉన్న పాత సామాగ్రి, పుస్తకాలు, గాజు సామాగ్రి తదితర వాటిని ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు తరలించాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. సెంటర్‌కు వచ్చినవారి వివరాల సేకరించి, ప్రతీ రోజు స్వచ్ఛత పోర్టల్, మేరీ లైఫ్ పోర్టల్ లలో నమోదే చేయాలని అన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ గోపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘనాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబీకులకు సర్పంచ్ గోపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. గ్రామానికి చెందిన శ్రీరాములుగౌడ్, జంగమ్మ కుటుంబీకులను బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి గురువారం బాధితుల నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలను అందజేశారు. ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తయ్యగౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు సురేశ్, మాజీ వార్డు సభ్యుడు శంకర్‌గౌడ్, నాయకులు మల్లేశ్‌గౌడ్, మహేశ్వర్‌గౌడ్, పరమేశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.

మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



నాగారంలో వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ యార్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలో సుమారు రూ.4.5 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్ వెజ్ మార్కెట్ యార్డును వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిని శిల్పావెంచర్ సమీపంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్ వెజ్ మార్కెట్ యార్డు పనులను ఆయన వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, డీఈఈ సుదర్శనం, రఘుతో కలిసి పరిశీలించారు. పనుల్లో వేగం పెంచడంతో పాటు ఎలాంటి నాణ్యత లోపం లేకుండా నిర్దేశించిన సమయం కంటే ముందే పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, నేతలు అన్నం రాజు శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

‘విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చారు’

- టీపీసీసీ నాయకుడు వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట్/మేడ్చల్: విద్యారంగాన్ని స్థానిక మంత్రి మల్లారెడ్డి వ్యాపారంగా మార్చారని టీపీసీసీ నాయకుడు వజ్రేష్‌యాదవ్ ఆరోపించారు. డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్‌లో దీక్షను చేపట్టారు. వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రైవేటు రంగంలో అనేక విద్యాసంస్థలను నెలకొల్పి ధనార్జనే ధ్యేయంగా మంత్రి మల్లారెడ్డి వ్యవహరిస్తున్నాడని, నిరుపేద విద్యార్థుల గోడు పట్టదా అని ప్రశ్నించాడు. తన కుటుంబసభ్యులకు యూనివర్సిటీలను తెచ్చుకున్న మంత్రి ప్రభుత్వం తరపున ఒక డిగ్రీ కళాశాల తీసుకురాకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గత ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డి తన సొంత కళాశాల భవనంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక నిరుపేదల చదువులు నిలిచిపోతున్నాయని, మేడ్చల్‌కు డిగ్రీ కళాశాల సాధించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, కార్యదర్శి ఆనంద్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదరిశ తరుణ్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, పలువురు యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మేడ్చల్‌లో దీక్ష